JAYABHERIDAILY.COM

ప్రభాత జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 03-05-2026

Medchal - Malkajgiri । Sunday 03-05-2026

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 336

పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 336 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com





తెలంగాణ రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. అయితే, ఈసారి ఆయన పర్యటనకు ముందే ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ప్రధాని పాల్గొనే బహిరంగ సభ పేరు విషయంలో ప్రధానమంత్రి కార్యాలయం జోక్యం చేసుకోవడం, రాష్ట్ర బీజేపీ ప్రతిపాదించిన పేరును మార్చాలని ఆదేశించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# 'జనాగ్రహం' తీసేయమన్న పీఎంవో

- ప్రధాని మోదీ సభ పేరు మార్పు
- రాష్ట్ర బీజేపీ ప్రతిపాదించిన పేరును మార్చాలని ఆదేశించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది
- 'ఆగ్రహం' అనే ప్రతికూల అర్థం వచ్చే పేరుతో సభ నిర్వహించడం సముచితం కాదని ప్రధానమంత్రి కార్యాలయం అభిప్రాయం
- మే 10వ తేదీన ప్రధాని మోదీ షెడ్యూల్ అత్యంత బిజీ

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. అయితే, ఈసారి ఆయన పర్యటనకు ముందే ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ప్రధాని పాల్గొనే బహిరంగ సభ పేరు విషయంలో ప్రధానమంత్రి కార్యాలయం జోక్యం చేసుకోవడం, రాష్ట్ర బీజేపీ ప్రతిపాదించిన పేరును మార్చాలని ఆదేశించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ తొలుత ఈ సభకు 'జనాగ్రహ సభ' అని పేరు పెట్టింది. సాధారణంగా 'జనాగ్రహం' అనే పదాన్ని రాజకీయ పోరాటాలు, నిరసనలు లేదా ప్రభుత్వ వ్యతిరేకతను వ్యక్తం చేసే సందర్భాల్లో వాడుతుంటారు. గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి అంశాలపై ప్రతిపక్షాల తీరును నిరసిస్తూ బీజేపీ దేశవ్యాప్తంగా ఈ పేరుతో కార్యక్రమాలు చేపట్టింది. అయితే, ఈసారి మోదీ పర్యటన కేవలం రాజకీయ సభకే పరిమితం కాలేదు. ఆయన హైదరాబాద్‌లో సుమారు 8 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఒక పక్క అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు, 'ఆగ్రహం' అనే ప్రతికూల అర్థం వచ్చే పేరుతో సభ నిర్వహించడం సముచితం కాదని ప్రధానమంత్రి కార్యాలయం అభిప్రాయపడింది. సానుకూల దృక్పథంతో, అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్న తరుణంలో ఈ పేరు మార్పు తప్పనిసరి అయింది. ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు రాష్ట్ర బీజేపీ తక్షణమే స్పందించింది. అప్పటికే రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నేతృత్వంలో 'జనాగ్రహ సభ' పేరుతో పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచార చిత్రాలు సిద్ధమయ్యాయి. ఇప్పుడు వాటన్నింటినీ తొలగించి, కేవలం 'ప్రధాని మోదీ బహిరంగ సభ'గా వ్యవహరించాలని నిర్ణయించారు. కార్యకర్తలు ఇప్పుడు పాత పోస్టర్లను సవరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలావుంటే, మే 10వ తేదీన ప్రధాని మోదీ షెడ్యూల్ అత్యంత బిజీగా ఉండనుంది. మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రధాని మోదీ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని తెలంగాణకు

...మిగతాది 2 లో

# విద్యుత్ సబ్ స్టేషన్ల పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు



- సోలార్ పవర్ పైన స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన
- విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ ఉన్నత స్థాయి సమీక్ష

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో నూతన పారిశ్రామిక వాడలు, హైస్పీడ్ రైల్ కారిడార్లు, ట్రిపుల్ ఆర్ వంటి అభివృద్ధి ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో డిమాండ్కు తగిన విద్యుత్ సరఫరాకు అవసరమైన సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి, ప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో కలిసి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు.

# మా లక్ష్యం సర్వోదయ తెలంగాణ



- తెలంగాణ రక్షణ సేన పేరుతో ఒక బలమైన రాజకీయ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు
- సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు
- పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్యత అంశాలు
- కేసీఆర్ ను వ్యక్తిగతంగా విమర్శించలేదు
- కల్వకుంట్ల కవిత

జయభేరి, హైదరాబాద్, మే 2 :

తెలంగాణ రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం. వచ్చాం. అన్ని అడ్డంకులను దాటుకొని తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ ఫ్లాట్ ఫామ్ ను ఏర్పాటు చేసుకున్నాం. 20 ఏళ్ల పాటు సాగిన తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థగా అలాగే కొనసాగుతుందని తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కవిత మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపైన తెలంగాణ రక్షణ సేన మాట్లాడుతుంది. పోరాటం చేస్తుంది. తెలంగాణ సాధించుకున్న తర్వాత మనం సర్వోదయ తెలంగాణ కావాలనుకున్నాం. ఇప్పుడు మేము సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా ముందుకు వస్తున్నాం. ప్రతి ఒక్కరి

...మిగతాది 2 లో



# భారత్‌లో 'పెట్రోల్' బావులేవి ??

జయభేరి, న్యూఢిల్లీ:

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇంకా పూర్తిగా చల్లారలేదు. ముఖ్యంగా 'హెర్మూజ్ జలసంధి' మూతపడటంతో ప్రపంచ దేశాలలో చమురు సంక్షోభం కొనసాగుతోంది. భారీ జనాభా ఉన్న భారతదేశంలో పెట్రోలియం ఉత్పత్తులకు భారీ డిమాండ్ ఉంది. ప్రపంచవ్యాప్తంగా చమురును దిగుమతి చేసుకునే మూడవ అదిపెద్ద దేశం కూడా మనదే. దీంతో, దేశీయంగా కూడా ముడి చమురును గణనీయమైన స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఉత్పత్తి ప్రధానంగా సముద్ర గర్భంలోని 'ఆఫ్‌షోర్', భూభాగంలోని 'ఆన్‌షోర్' క్షేత్రాల నుంచి వస్తోంది. దేశంలో అతి పెద్ద చమురు క్షేత్రం ముంబై తీరంలోని ముంబై హై కాగా, పలు రాష్ట్రాలు కూడా ఈ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. భూభాగం నుంచి ముడి చమురును అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా రాజస్థాన్ నిలుస్తోంది. దేశీయ ఉత్పత్తిలో సుమారు 2025 శాతం వాటాతో ఇది అగ్రస్థానంలో ఉంది. ఇక్కడి బార్మర్ బేసిన్‌లోని మంగళ, భాగ్యం, ఐశ్వర్య క్షేత్రాలు ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ తీసిన చమురును 700 కిలోమీటర్ల

...మిగతాది 2 లో

# పిఠాపురానికి నిధుల వరద

- వంద పడకల ఏరియా ఆసుపత్రి, 234 కోట్ల రూపాయలతో 400 రోడ్లు
- 376 కోట్ల రూపాయలతో నీటి సరఫరా
- 487 మందికి ఉద్యోగ మేళాల ద్వారా ఉపాధి
- 34 వేల 853 కోట్ల రూపాయల పారిశ్రామిక పెట్టుబడులు
- రూపురేఖలు మారుస్తున్న ఏపీ డిప్యూటీసీఎం పవన్



జయభేరి, విజయవాడ, మే 2 :

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట ప్రకారం పిఠాపురం నియోజకవర్గం మార్చే పనిలో ఉన్నారు. పిఠాపురం

...మిగతాది 2 లో



# సీఎం అధ్యక్షతన కేబినెట్ భేటీ

- కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్!

జయభేరి, హైదరాబాద్, మే 2 :

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా పలు ముఖ్యమైన అంశాలపై మంత్రివర్గం చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ఈ సమావేశంలో ముఖ్యంగా రైతులు, ఉద్యోగుల సమస్యలు, సాగు నీటి ప్రాజెక్టు అంశంపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఈ నెల 4 సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. రాష్ట్ర అభివృద్ధి పలు కీలక అంశాలపై ఈ సమావేశంలో మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. సాగు నీటి ప్రాజెక్టులు, ఉద్యోగుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక అంశాలు ప్రధానంగా అజెండాలో ఉన్నట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణపై కేబినెట్‌లో కీలకంగా చర్చించనున్నారు. ప్రాజెక్టు భవిష్యత్తు, సాంకేతిక అంశాలు, అవసరమైన మార్పులపై దృష్టిసారించనున్నారు. అదే సమయంలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంపై కూడా చర్చించనున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రితో భేటీ అంశం నేపథ్యంలో తదుపరి చర్యలపై చర్చించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ డిమాండ్స్‌పై కేబినెట్‌లో చర్చించనున్నారు. ముఖ్యంగా RTC ఉద్యోగుల విలీన ప్రక్రియపై ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ నివేదికపై చర్చించనున్నారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బెనిఫిట్స్ బకాయిలను 100 రోజుల్లో చెల్లించే విధానంపై చర్చించనున్నారు. సంక్షేమ రంగంలో భాగంగా కొత్త ఆసరా పెన్షన్ల మంజూరు అంశంపై కూడా చర్చించనున్నారు. తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీల మేరకు కేకే, కోదండరాం కమిటీ విధివిధానాలపై చర్చించనున్నారు.ఇందిరమ్మ భీమా పథకం అమలు పై కూడా కీలకంగా చర్చించనున్నారు. అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. ఈ అంశాలతో పాటు ఇతర పరిపాలనా, అభివృద్ధి విషయాలపై కూడా కేబినెట్ చర్చించనున్నారు.

మొదటిపేజీ తరువాయి

## 'జనాగ్రహం' తీసేయమన్న పీఎంవో

కేటాయించిన పలు ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. సాయంత్రం 4:00 గంటలకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు హాజరవుతారు. ఈ సభకు సంబంధించి రాష్ట్ర బీజేపీ నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. బీజేపీ శ్రేణులు ప్రధాని ప్రసంగంపై ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే తెలంగాణపై భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సభ ద్వారా అటు అభివృద్ధిని, ఇటు రాజకీయ బలాన్ని చాటుకోవాలని బీజేపీ భావిస్తోంది. పరేడ్ గ్రౌండ్స్ సభకు భారీ ఎత్తున జనాన్ని సమీకరించి, దక్షిణ భారత్‌లో పార్టీ పట్టును నిరూపించుకోవాలని చూస్తోంది. పేరు మార్పు అనేది చిన్న పరిణామమే అయినప్పటికీ, అధికారిక పర్యటనల విషయంలో ప్రధానమంత్రి కార్యాలయం ఎంత నిశితంగా వ్యవహరిస్తుందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ప్రధాని ప్రసంగంలో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం చేసిన సాయంపై స్పష్టమైన ప్రకటనలు ఉండవచ్చని పార్టీ వర్గాలు ఆశిస్తున్నాయి.

## విద్యుత్ సబ్ స్టేషన్ల పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు

ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి తో పాటు ఇంధన శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా ప్రాధాన్య క్రమంలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి అనుమతులు ఇవ్వాలని అధికారులకు చెప్పారు. భారీ డేటా సెంటర్లకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సోలార్ పవర్ పైన స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సోలార్ స్టౌల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ల పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద భూమి అందుబాటులో ఉన్న చోట ఉమ్మడి జిల్లాలో రెండు సబ్ స్టేషన్ల పక్కన ప్రయోగాత్మకంగా సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టే 18 సోలార్ పవర్ ప్లాంట్లు (హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో జిల్లాకు రెండు చొప్పున) నిర్మాణానికి నోడల్ అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖలో సరఫరా లోపాలు, మెరుగైన విద్యుత్ సరఫరాకు ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (Rythu Discom) లో చేరికపై ఉద్యోగులు, సిబ్బందికి ఉన్న అపోహలు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

## పిఠాపురానికి నిధుల వరద

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటం పైన దృష్టి సారించిన పవన్ కళ్యాణ్ కేంద్ర, రాష్ట్ర నిధులతో పిఠాపురానికి కొత్త రూపు సంతరించుకునేలా చేస్తున్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆధ్యాత్మికం, పారిశ్రామిక రంగాల్లో భారీ అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. పిఠాపురంలో అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. మొత్తం 37.25 కోట్ల రూపాయలతో పనులు చేస్తున్నారు.
వంద పడకల ఏరియా ఆసుపత్రి, 234 కోట్ల రూపాయలతో 400 రోడ్ల పనులు అత్యాధునిక వసతులతో పిఠాపురం బస్టాండ్ ను అభివృద్ధి చేస్తున్నారు. పిఠాపురం మున్సిపాలిటీని సెలక్షన్ గ్రేడ్ స్థాయికి, గొల్లప్రోలు నగర పంచాయతీని గ్రేడ్ 3 మున్సిపాలిటీ స్థాయికి మార్చారు. పిఠాపురంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను వంద పడకల ఏరియా ఆసుపత్రి గా మార్చి, 34 కోట్ల రూపాయలతో అధునాతన వసతులను కల్పిస్తున్నారు. మొత్తం పిఠాపురం నియోజకవర్గంలో 400 రోడ్ల పనులు 234 కోట్ల రూపాయలతో చేస్తున్నారు.
376 కోట్ల రూపాయలతో నీటి సరఫరా
జల జీవన్ మిషన్ కింద 376 కోట్ల రూపాయలతో నీటి సరఫరాను పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు, గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క కాకినాడ జిల్లాలో పవన్ కళ్యాణ్ 800 కోట్ల అంచనా వ్యయంతో రహదారి పనులు చేయించడానికి అవకాశం కల్పించారు.
487 మందికి ఉద్యోగ మేళాల ద్వారా ఉపాధి
ఇప్పటివరకు 487 మందికి ఉద్యోగ మేళాల ద్వారా ఉపాధి కల్పించారు. స్కిల్ హబ్ ను ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. కోటి రూపాయలతో ఇండోర్ స్టేడియాన్ని ఆధునీకరిస్తున్నారు. ఉప్పాడ లో ప్రతిష్ఠాత్మక స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ ను ఏర్పాటు చేస్తున్నారు.
34 వేల 853 కోట్ల రూపాయల పారిశ్రామిక పెట్టుబడులు
నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్ గా మార్చాలని సంకల్పంతో ఉన్న పవన్ కళ్యాణ్ 18 నెలల కాలంలో దాదాపు 34 వేల 853 కోట్ల రూపాయల పెట్టుబడులను పిఠాపురం నియోజకవర్గానికి తీసుకువచ్చారు. వీటితో 5000 మందికి ఉపాధి లభించనుంది. 20 కోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గంలోని 19 ప్రధాన దేవాలయాలను పవన్ కళ్యాణ్ అభివృద్ధి చేస్తున్నారు. మొత్తంగా పిఠాపురం నియోజకవర్గ రూపురేఖలు మార్చి అన్ని రంగాలలోనూ పిఠాపురాన్ని ముందు వరుసలో నిలబెట్టనున్నారు.

## భారత్‌లో 'పెట్రోల్' బావులేవి ??


'హీటెడ్ పైప్‌లైన్' ద్వారా గుజరాత్‌లోని రిఫైనరీలకు తరలిస్తున్నారు. రాజస్థాన్ తర్వాత గుజరాత్, అసోం రాష్ట్రాలు కీలక ఉత్పత్తిదారులుగా ఉన్నాయి. భారతదేశంలో 1889లోనే చమురును వెలికితీసిన అత్యంత పురాతన ప్రాంతం అసోంలోని దిగ్బోయి. అలాగే అస్సాంలోని నహర్ కటియా, మొరాన్ లో కూడా చమురు బావులు ఉన్నాయి.ఈ మూడు రాష్ట్రాలు కలిపి దేశంలోని ఆన్‌షోర్ ఉత్పత్తిలో 95 శాతం వాటాను కలిగి ఉన్నాయి. గుజరాత్ లోని అంక్లేశ్వర్, కంబాత్, కలోల్, మెహసానా ప్రాంతాల్లో ముడి చమురును సేకరిస్తున్నారు. తమిళనాడులోని కావేరి బేసిన్ లో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాగోదావరి బేసిన్ తీర ప్రాంతాల్లో చమురు ఉన్నట్లు కనుగొన్నారు. ఇక సముద్ర గర్భంలోని (ఆఫ్‌షోర్) క్షేత్రాల విషయానికొస్తే, ముంబై హై దేశంలోనే అతిపెద్ద, అత్యంత ఉత్పాదక చమురు క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ముంబై తీరానికి పశ్చిమంగా అరేబియా సముద్రంలో 160 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రం, దేశ చమురు ఉత్పత్తిలో సింహభాగం అందిస్తోంది. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాగోదావరి (కేజీ) బేసిన్, తమిళనాడులోని కావేరీ బేసిన్, అరుణాచల్ ప్రదేశ్‌లో కూడా చమురు, సహజవాయువు నిక్షేపాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి కూడా ఉత్పత్తిని పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం భారత్ దౌత్య ప్రయత్నాలు ఫలించడంతో హెర్మూజ్ నుంచి నౌకల ప్రయాణానికి అనుమతులు లభించాయి. దాంతో తాజాగా హెర్మూజ్‌ను దాటి చమురు ట్యాంకర్లు గుజరాత్‌లోని అదానీ పోర్ట్‌కు చేరుకున్నాయి.

## నారాయణపురంలో దొంగల హల్ చల్

జయభేరి, దాచేపల్లి :

పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవేశించిన దుండగులు నగదు, బంగారం, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. బాధితుల అంచనా ప్రకారం సుమారు 25 లక్షల రూపాయల విలువైన ఆస్తి నష్టపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న గురజాల డీఎస్పీ ఉమామహేశ్వరరావు, దాచేపల్లి సీఐ రాజేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఉపశమనమా లేక దీర్ఘకాల అభివృద్ధా?




దేశంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉచితాలు అనే పదం రాజకీయాల్లో ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి పార్టీ కూడా ప్రజలను ఆకర్షించడానికి కొత్త కొత్త పథకాల పేరుతో ఉచితాలు ప్రకటిస్తోంది. ఉచిత విద్యుత్, ఉచిత డబ్బు పంపిణీ, ఉచిత గ్యాస్, ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలు ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని ఇస్తున్నట్టే కనిపిస్తున్నాయి. కానీ ఈ ఉచితాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? నిజంగా ఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయా? లేక ఓట్లు సాధించడానికి ఒక రాజకీయ వ్యూహమా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా ఉత్పన్నమవుతున్నాయి. ఉచితాలు ఇవ్వడం అంటే తప్పు అని ఒకే పదంతో చెప్పలేం. ఎందుకంటే కొన్ని సందర్భాలలో ప్రభుత్వ జోక్యం అవసరం అవుతుంది. ఉపశమనా లేక దీర్ఘకాల అభివృద్ధా? ఈ రెండు మధ్య ఉన్న సున్నితమైన తేడాను గుర్తించకపోతే, ప్రజాస్వామ్యం స్వయం గా దారితప్పే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మనం చూస్తున్న పరిస్థితి కూడా అదే. పేదరికం, ఆకలి, ఆరోగ్య సమస్యలు, విద్య లోపం వంటి అంశాలలో ప్రభుత్వం సహాయం చేయడం సమాజానికి అవసరం. ఉదాహరణకు, పేద విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఉచిత వైద్యం వంటి పథకాలు సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే పునాది లాంటివి.ఇవి ఒక దేశ అభివృద్ధికి అవసరమైన మౌలిక హక్కులు. కానీ అదే సమయంలో ప్రతి అంశాన్ని ఉచితంగా మార్చడం, ప్రతి అవసరాన్ని ప్రభుత్వంపై ఆధారపడి తీర్చుకోవడం ఒక ప్రమాదకర దిశగా తీసుకెళ్తుంది. ఉచితాల రాజకీయాలు తాత్కాలికంగా ప్రజలకు ఆనందాన్ని ఇస్తాయి. ఎన్నికల సమయంలో ఇది మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారీ సమస్యలతో బాధపడుతున్నప్పుడు, అతనికి తక్షణ ఉపశమనాన్ని ఇచ్చే ఏ పథకమైనా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ దీర్ఘకాలంలో ఈ పథకాల ప్రభావం ఎలా ఉంటుందో చాలా మంది ఆలోచించరు. ఒక సమాజం నిరంతరం ఉచితాలపై ఆధారపడితే, క్రమంగా కష్టపడి సంపాదించే భావన తగ్గిపోతుంది. స్వయం సమర్థత క్షీణిస్తుంది. వ్యక్తి తన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించకుండా, ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది.యువత అనేది ఒక దేశానికి బలం. వారి కృషి, ఆలోచనలు, సృజనాత్మకత దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ అదే యువత ఉచితాలవల్ల అలసత్వానికి లోనైతే, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. చదువుకున్న యువకులు కూడా తమకు తగిన అవకాశాలు దొరకక చిన్న చిన్న ఉద్యోగాలలోనే నిలిచిపోతున్నారు. ఇది కేవలం వారి వైఫల్యం కాదు. ఇది ఒక వ్యవస్థలోని లోపం. విద్యావ్యవస్థ సరైన నైపుణ్యాలను అందించకపోవడం, పరిశ్రమల అభివృద్ధి లేకపోవడం, ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేకపోవడం, ఈ కారకాలన్నీ కలిసి ఈ పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఆర్థిక పరిపాలన. ఒక ప్రభుత్వం ఉచితాలు ప్రకటించడానికి ముందు, ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకుంటుందో ఆలోచించాలి. ఆదాయం లేకుండా ఖర్చులు పెంచితే, అప్పులు తప్పవు. అప్పులు పెరిగితే, భవిష్యత్ తరాలపై భారమవుతుంది. ఈ రోజు తీసుకునే నిర్ణయాలు రేపటి తరాలకు ప్రభావం చూపుతాయి. కానీ ఎన్నికల రాజకీయాల్లో ఈ దీర్ఘకాల ఆలోచన చాలా సందర్భాల్లో కనిపించదు. తక్షణ ప్రయోజనాల కోసం భవిష్యత్తును తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే చాలా చోట్ల అప్పులు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వంపై నిందలు వేయడం ఒక సాధారణ ధోరణిగా మారింది. వాళ్లు అప్పులు చేసి వెళ్లారు అనే వాదన వినిపిస్తుంది. కానీ అదే సమయంలో కొత్తగా కూడా అప్పులు తీసుకుంటూ ఉచిత పథకాలను కొనసాగించడం ఒక విరుద్ధమైన పరిస్థితి. ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రభుత్వాన్ని కేవలం హామీల ఆధారంగా కాకుండా, ఆ హామీలను అమలు చేసే సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక శక్తి. ఆ శక్తిని ఎలా ఉపయోగించాలో ప్రజలపై ఆధారపడి ఉంటుంది. ఒక ఓటు ద్వారా మనం ఒక ప్రభుత్వాన్ని ఎంచుకుంటాం. ఆ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఓటు వేసేటప్పుడు తక్షణ ప్రయోజనాలను కాకుండా, దీర్ఘకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి. ఉచితాలు ఇచ్చే పార్టీని కాకుండా, అవకాశాలు సృష్టించే పార్టీని ఎంచుకోవాలి.ఇక్కడ విద్య, ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇవి ఉచితంగా అందించాల్సిన అత్యవసర రంగాలు. ఎందుకంటే ఒక వ్యక్తి చదువుకున్నప్పుడు, అతను తన జీవితాన్ని మార్చుకునే సామర్థ్యాన్ని పొందుతాడు. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అతను సమాజానికి ఉపయోగపడగలడు. కాబట్టి ఈ రెండు రంగాలలో పెట్టుబడి పెట్టడం ఖర్చు కాదు, అది ఒక పెట్టుబడి. ఇది దేశ భవిష్యత్తును నిర్మించే పునాది. అదే సమయంలో మిగతా రంగాలలో ఉచితాల కంటే అవకాశాలు ఇవ్వడం ముఖ్యమైనది. ఉద్యోగాలు సృష్టించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు సమాజాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్తాయి. ఒక రైతుకు ఉచిత డబ్బు ఇవ్వడం కంటే, అతనికి సరైన ధర, నీరు, మార్కెట్ ఇవ్వడం ఎక్కువ ప్రయోజనకరం.
ఒక యువకుడికి ఉచిత సబ్సిడీ ఇవ్వడం కంటే, అతనికి ఉద్యోగం లేదా వ్యాపారం చేసే అవకాశాన్ని కల్పించడం ఉత్తమం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే, హామీలు ఇవ్వడం చాలా సులభం. కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోవడం ప్రజల్లో నిరాశను కలిగిస్తుంది. ఇది ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒక నాయకుడు చెప్పిన మాట నిలబెట్టుకోకపోతే, ప్రజలు రాజకీయ వ్యవస్థపై విశ్వాసం కోల్పోతారు. ఇక ప్రజల పాత్ర గురించి మాట్లాడితే, మార్పు ఎక్కడి నుండి వస్తుంది అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఉంది, ప్రజల నుంచే. ఒక సమాజం చైతన్యవంతంగా మారితే, రాజకీయాలు కూడా మారతాయి. ప్రజలు తమ హక్కులను మాత్రమే కాకుండా, తమ బాధ్యతలను కూడా గుర్తించాలి. ఉచితాల కోసం కాకుండా, అభివృద్ధి కోసం ఓటు వేయాలి. అప్పుడు మాత్రమే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, మేధావులు కూడా ఈ మార్పులో కీలక పాత్ర పోషించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. ఉచితాలవల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలి. దీర్ఘకాల అభివృద్ధి ప్రాముఖ్యతను తెలియజేయాలి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంచలనం కంటే సత్యాన్ని చూపాలి. మొత్తంగా చూస్తే, ఉచితాల రాజకీయాలు పూర్తిగా శాపమని చెప్పలేం. కానీ అవి నియంత్రణ లేకుండా కొనసాగితే, సమాజానికి నష్టం కలిగించే అవకాశం ఉంది. అవసరమైన చోట ఉచితాలు ఉండాలి, కానీ అవి ఒక వ్యూహంగా మారకూడదు. ప్రజల సంక్షేమం అనే పేరుతో ఓట్లు కొనే ప్రయత్నం ఆగాలి. ఈ రోజు మనం ఒక కీలక దశలో ఉన్నాం. ఒక దిశలో కొనసాగితే, మనం ఆధారపడి జీవించే సమాజంగా మారిపోతాం. మరో దిశలో ముందుకు సాగితే, మనం స్వయం సమర్థతతో అభివృద్ధి చెందే సమాజంగా మారగలం. ఈ ఎంపిక మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న మళ్లీ అదే.. మార్పు ఎవరు తెస్తారు? జవాబు కూడా అదే, మనమే. ప్రజలు మేలుకుంటే, రాజకీయాలు మారతాయి. నాయకులు కూడా మారాల్సి వస్తుంది. హామీలు ఇవ్వడమే కాదు, వాటిని నిలబెట్టుకోవాల్సి వస్తుంది. ఆ రోజు తప్పకుండా వస్తుంది. కానీ అది స్వయంగా రాదు. మన ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే, మన ఓటులో మార్పు వచ్చినప్పుడే, మన సమాజంలో మార్పు వస్తుంది. అందుకే ఇప్పుడు అవసరం, చైతన్యం, బాధ్యత, దీర్ఘకాల దృష్టి. ఉచితాల మాయ నుండి బయటపడి, అభివృద్ధి మార్గంలో నడవాల్సిన సమయం ఇదే.

## ఈసీపై పోరాటం ఆపని దీదీ

■ టీఎంసీ పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీం కోర్టు

జయభేరి, కోల్ కత్తా, మే 2 :

పశ్చిమ్ బెంగాల్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్లుగా కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే ఈసీ నియమించింది. దీంతో ఈసీ నిర్ణయాన్ని అధికార టీఎంసీ న్యాయస్థానాల్లో సవాల్ చేసింది. తొలుత కోల్‌కత్తా హైకోర్టుకు శుక్రవారం వెళ్లగా.. అక్కడ టీఎంసీకి ఉపశమనం లభించలేదు. దీంతో సుప్రీంకోర్టు తలుపు తట్టింది. కానీ, అక్కడ కూడా దీదీ పార్టీకి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఈసీ నిర్ణయం సరైందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పడం గమనార్హం.రాష్ట్రంలో పోలింగ్ ముగిసి, ఫలితాలు మరో రెండు రోజుల్లో వెల్లడికానున్నా.. కేంద్ర ఎన్నికల కమిషన్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మాత్రం తన పోరాటాన్ని ఆపటం లేదు. ఈ అంశంపై కలకత్తా హైకోర్టులో ఎదురుదెబ్బ తగలడంతో ఆమె సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, అక్కడ కూడా మమతా బెనర్జీకి ఊరట దక్కలేదు. దీనిపై శనివారం విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయంలో ఎటువంటి తప్పిదం లేదని పేర్కొంది. కలకత్తా హైకోర్టు నిర్ణయం సమర్థనీయమేనని, దీనిపై తాము ఎటువంటి ఆదేశాలు ఇవ్వబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు టీఎంసీ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఎస్ఐఆర్ విషయంలో కేంద్ర ఎన్నికల కమిషన్‌పై దీదీ యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే.'ప్రభుత్వ ఉద్యోగులు వారి విధుల్లో భాగంగానే పనిచేస్తారు.. అది రాష్ట్రమైనా.. కేంద్రమైనా.. వారికి ఎలాంటి పక్షపాతాలు ఉండవు. మైక్రో అబ్జర్వర్లుగా కేంద్ర ఉద్యోగులు ఉండటంలో తప్పేంటి?.. దీనిపై పూర్తి నిర్ణయాధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంది..ఎన్నికల విధులకు సిబ్బంది నియామకంపై రాజకీయ పార్టీలను ఎన్నికల సంఘం సంప్రదించాల్సిన అవసరం లేదు. దీనిని రాజకీయం చేయడం తగదు" అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందిరాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను తప్పించి, వారి స్థానంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లుగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్ని ఈసీ నియమించిందని టీఎంసీ ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను ఖండించిన ఈసీ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా కొనసాగుతారని స్పష్టం చేసింది. కానీ, అధికార టీఎంసీ శుక్రవారం కోల్‌కతా హైకోర్టులో దీనిపై ఓ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చడంతో సుప్రీం కోర్టులో అత్యవసర పిటిషన్ వేసింది.పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. బెంగాల్ చరిత్రలో తొలిసారి భారీగా పోలింగ్ నమోదయ్యింది. రెండు దశల్లో కలిసి 92 శాతానికిపైగా పోలింగ్ నమోదయినట్టు ఈసీ తెలిపింది. హింసాత్మక ఘటనలు కూడా జరగలేదు. కానీ, రెండో దశ పోలింగ్ ముగిసిన తర్వాత.. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద టీఎంసీ ధర్నాకు దిగింది. కానీ, వీటిని కేంద్ర ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది. మే 4న ఓట్లను లెక్కించి, ఫలితాలు వెల్లడించనున్న సంగతి తెలిసిందే.

## మా లక్ష్యం సర్వోదయ తెలంగాణ

జీవితంలో వెలుగులు నిండటమే సర్వోదయ తెలంగాణ లక్ష్యం. సర్వోదయ తెలంగాణ సాధించటం కోసం మేము పాంచజన్యం అనే ఐదు అంశాలను తీసుకున్నామని అన్నారు. అధర్మం పై యుద్ధం చేసేందుకు శ్రీకృష్ణుడు మోగించిన యుద్ధబేరియే పాంచజన్యం. మేము కూడా అదే స్ఫూర్తితో పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్యత అంశాలను తీసుకున్నాం. ఇప్పుడు ప్రతిపక్షంగా...రేపు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇవే అంశాలను తీర్చటంలో మా ఫోకస్ ఉంటుంది. మన రాష్ట్రంలో చాలా కుటుంబాల్లో విద్య, వైద్యం కోసమే 60 శాతం ఆదాయం ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో సేవింగ్స్, ఎమర్జెన్సీ వస్తే ప్రజల దగ్గర డబ్బు ఉంటే పరిస్థితి లేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తున్నప్పటికీ 75 శాతం ప్రజలు ప్రైవేట్ లోనే చదువుతున్నారు. ప్రైవేట్ లో చదివే వారికి కూడా వారు ఎంత వరకు చదువుతారో అంత వరకు కూడా ఉచిత విద్యను అందిస్తాం. అందరికీ ఉచిత విద్య సాధ్యమే. అందుకు అన్ని లెక్కలు వేసిన తర్వాతే మేము ప్రకటించాం. 20 ఏళ్లుగా మీరు నన్ను చూస్తున్నారు. ఇచ్చిన మాట, పట్టిన తోవను విడవకుండా ఉన్న వ్యక్తిని. ఇక వైద్యం విషయంలో కూడా ప్రజల డబ్బంతా దానికే ఖర్చు అవుతుందని అన్నారు. ఆరోగ్యశ్రీలో ఇప్పుడు 10 లక్షల వరకు ఇస్తున్నారు. కానీ మొదట్లో 2 లక్షల రూపాయలే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కానీ ఇప్పుడు 10 లక్షలు ఇవ్వటం కూడా సాధ్యమవుతుంది. ఆరోగ్య శ్రీ దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. విద్యార్థులకు ఫ్రీ మీల్స్ ఉంటే కూడా సాధ్యమా అన్నారు. కానీ అది కూడా సాధ్యమైంది. మన రాష్ట్రంలో క్యాన్సర్ వస్తే డబ్బులు లేక వైద్యం అందక చాలా మంది చనిపోతున్నారు. మూడు లక్షల రూపాయలు కూడా లేక క్యాన్సర్ పేషెంట్లకు వైద్యం చేయించకుండా చాలా కుటుంబాలు సరిపెట్టుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల లైఫ్ స్పాన్ పెరుగుతుంటే మనం మాత్రం ఎందుకు ఇలా ఉండాలి? ఎన్ని లక్షలు ఖర్చైనా సరే తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం తెలంగాణ బిడ్డల వైద్యం కోసం వెనుకడుగు వేయదు. ఇక రైతు లేనిదే మనకు జీవితం లేదు. అలాంటి రైతుకు గౌరవం దక్కాలి. తెలంగాణలో రైతన్నకు ఆత్మగౌరవం కోసం తెలంగాణ రక్షణ సేన అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికీ కల్లాల దగ్గరే వడ్లు ఉన్నాయి. కొనుగోలు కేంద్రాలు తెరవమని రైతులు ధర్నా చేయాల్సిన పరిస్థితి. అసలు రైస్ ను ఎగుమతి చేసే పరిస్థితి ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. అందుకోసం ఒక కమిటీ ఏర్పాటు చేసి రైతుల పండించే బియ్యాన్ని ఎక్స్ పోర్ట్ చేయవచ్చు. జనంబాటలో మేము ఒక రైతును కలిశాం. నాలుగు రోజులుగా మక్కాలు కొనటం లేదంటూ కొనుగోలు కేంద్రం వద్దనే ఉన్నానని చెప్పారు. ఆ మరుసటి రోజే ఆ రైతు అదే మక్క కుప్పపై కుప్పకూలి చనిపోయాడు. అంటే మన దేశంలో రైతు ప్రాణానికి విలువ లేకుండా పోయింది. ఆ సంఘటన ఇప్పటికీ కూడా నన్ను కలవరపాటుకు గురిచేస్తోందని అన్నారు.
రైతన్నలకు మేలు చేసే విషయంలో మేము చాలా సీరియస్ గా పని చేస్తున్నాం. ఇక మేము ఎంచుకున్న మరో అంశం ఉపాధి. మన రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్ అయిపోయింది. యూత్ ఏం కోరుకుంటున్నారో ప్రభుత్వానికి అర్థం కావటం లేదు. ఇతర దేశాల్లో ప్రభుత్వాలు అక్కడి యూత్ ఆలోచనలు ప్రోత్సహిస్తుండటంతో తక్కువ వయసులోనే వారంతా మిలియనీర్లు అవుతున్నారు. 1825 ఏళ్ల లోపు ఉన్న జెన్ జీ ని నేను నమ్ముతున్నా. వారి ఆలోచనకు అండగా నిలవాలని మేము అనుకుంటున్నాం. జెన్ జీ తో పాటు 2545 ఏళ్ల లోపు పాటు మంచి ఆలోచన తో వస్తే వారికి ప్రభుత్వమే 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణం ఇస్తుంది. యువత జాబ్ చేయటం కాదు. జాబ్ ఇచ్చేలా సిద్ధం కావాలి. మన దగ్గర నుంచి కూడా ఒక గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు రావాలి. మన రాష్ట్రంలో అన్ని సంస్థల నుంచి కూడా పదివేల కోట్ల ఆదాయం రావటం లేదు. ప్రభుత్వం దీనిపై సరైన దృష్టి పెడితే ఒకటి, రెండు కంపెనీలు సక్సెస్ అయిన సరే రాష్ట్రానికి చాలా ఆదాయం వస్తుంది. ఉద్యోగాలకు సంబంధించి మొన్న నేను 4 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ అంటే చాలా ప్రశ్నలు వచ్చాయి. కానీ ఎస్సీ, ఎస్టీ, ఫిజికల్లీ హ్యాండిక్యాప్ బ్యాక్ లాగ్ పోస్టులు చాలా ఖాళీ ఉన్నాయి. వాటన్నింటినీ నింపి ప్రభుత్వ శాఖలను బలోపేతం చేయాల్సి ఉంది. ఇక సీనియర్ సిటిజన్స్ కోసం కూడా మన దేశంలో ఒక శాఖ ఉండాలని అన్నారు. సీనియర్ సిటిజన్స్ కు ఉన్న హక్కులకు సంబంధించి పోలీసులకు కూడా అవగాహన లేదు. వారి కంప్లైట్ ఇస్తే దాన్ని ప్రత్యేకంగా టేకాఫ్ చేయాల్సి ఉంటుంది. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్ లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదు. మంచి ఆరోగ్యం, ఆలోచన విధానం ఉన్న వాళ్లకు రుణాలు ఇవ్వకపోవటం దారుణం. మా ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అదే విధంగా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు కావాల్సిన అన్ని ప్రణాళికలు మా వద్ద ఉన్నాయని వెల్లడించారు.

**కేసీఆర్‌తో తనకు సైద్ధాంతిక విభేదాలు మాత్రమే**

భవిష్యత్తులో అధికారంలోకి వస్తే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తెలిపారు. BRSలో జరిగిన తప్పులను మాజీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా, తాను మరింత గట్టిగా పోరాడలేకపోయానని అందుకే ప్రజలకు క్షమాపణ చెప్పానని అన్నారు. తాను అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే అమరవీరుల స్థూపానికి కట్టేసి రాళ్లతో కొట్టాలని వ్యాఖ్యానించారు. సమాజంలో మార్పు తీసుకువస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో TRS చీఫ్ కవిత తన తండ్రి కేసీఆర్‌తో విభేదాలపై స్పందించారు. తాను బీఆర్ఎస్ అధ్యక్షుడిని మాత్రమే విమర్శించానని, తన తండ్రిని కాదని ఆమె స్పష్టం చేశారు. తల్లిదండ్రులకు తన పూజలో మొదటి స్థానం ఉంటుందని, నాన్నగా ఆయన లేకపోతే తనకు జన్మ లేదని తెలిపారు. కేసీఆర్‌తో తనకు కేవలం సైద్ధాంతిక విభేదాలు మాత్రమే ఉన్నాయని, వ్యక్తిగతంగా ఎటువంటి సమస్యలు లేవని కవిత తేల్చిచెప్పారు.

# పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలకు అన్ని కష్టాలే

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆరోపణ
- దేవరకద్రలో నియోజకవర్గ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యాచరణ ప్రణాళిక సభ




**జయభేరి, దేవరకద్ర :**

గత అది ఏండ్ల కేసీఆర్ పాలనలో పేదలకు ఇల్లు, రేషన్ కార్డులు ఏ మాత్రం ఇవ్వలేదని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆరోపించారు. దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్ లో శనివారం ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక దేవరకద్ర నియోజకవర్గం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 8 లక్షల కోట్ల అప్పులకు, మిత్తిలు కట్టుకుంటూ ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 2 లక్షల రూపాయల రుణమాఫీ, 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 10 లక్షల ఆరోగ్యశ్రీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల తో పాటు రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ, పైరవీలకు తావు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను ఇచ్చామన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పేర్కొన్నారు.అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఏడాదికి 13 వేల కోట్లు వెచ్చించి, రేషన్ షాప్ ల ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం ఇస్తున్నామని, దేశంలో ఎక్కడ కూడా బిజెపి పాలిత రాష్ట్రాలలో సన్న బియ్యం ఇవ్వడం లేదన్నారు.పదేళ్లలో బిఆర్ఎస్ చేయని అభివృద్ధిని, చేసి చూపిస్తున్నామని, ముఖ్యంగా దేవరకద్ర నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇండ్లు మంజూరు చేశామని, అందులో సుమారు 2300 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగతావి బేస్మెంట్ దశలో ఉన్నాయని అన్నారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తుందని, రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చేందుకు విభిన్న పథకాలకు శ్రీకారం చుట్టి ముందుకెళ్తుంటే, ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నా అన్నారు.తదనంతరం అడ్డాకుల, మూసాపేట్, భూత్పూర్ మండలాలకు చెందిన అంగన్ వాడి వర్కర్స్ కు మొబైల్ ఫోన్ లను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## దేవరకద్రలో పల్లె వెలుగు బస్సు సర్వీస్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం పల్లె వెలుగు బస్సు సర్వీసును దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. దేవరకద్ర కు వచ్చే బస్సు బస్టాండ్ వరకు రాకపోవడంతో దేవరకద్ర పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించి వెంటనే సంబంధిత ఆర్టీసీ అధికారులతో మాట్లాడి దేవరకద్రకు వచ్చే ప్రతి బస్సు బస్టాండ్ కు వచ్చేలా చర్యలు తీసుకొని బస్ సర్వీసును ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని అడ్డాకుల మండలం రామచంద్రాపురంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మూసాపేట్ మండలం పోల్కంపల్లి లో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి యాదయ్య తల్లి దశదినకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం

- బిఆర్ఎస్ పార్టీ రాష్ట నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం గొడుకొండ్ల (మాల్) జయ ఫంక్షన్ హాల్ లో నసర్లపల్లి గ్రామానికి చెందిన కనికటి సునిత బాలు యాదవ్ కుమార్తె, కుమారుడు శివ భార్గవి యాదవ్,భవేష్ శేయాన్స్ యాదవ్ ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి హాజరై చిరంజీవులను ఆశీర్వదించారు.ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు సిమర్ల శ్రీను యాదవ్,పరమేష్ యాదవ్,దాసరి తిరుపతయ్య,సత్తారి, తదితరులు పాల్గొన్నారు.

## మోడీ సభకు భారీ జన సమీకరణ



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 02:**

ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ప్రధాని నరేంద్ర మోడీ హాజరవుతున్న సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని జిజేపి పార్టీ శ్రేణులకు, ప్రజలకు విజ్ఞప్తి చేసింది. యాదగిరిగుట్ట మండలకేంద్రంలో జిజేపి పార్టీ మండల అధ్యక్షులు గుంటిపల్లి మహేశ్వరిసత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో మండల ప్రభారి పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య ఈ మేరకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మండల అధ్యక్షులు కళ్ళెం శ్రీనివాస్,జిల్లా కౌన్సిల్ సభ్యులు గంధమల్ల మహేష్ గౌడ్,మండల ప్రధాన కార్యదర్శులు గోపగాని ప్రసాద్ గౌడ్,దేవరకొండ నారాయణ,గజం సంతోష్, దొమ్మాట రాజు,ఏలూరి సత్యనారాయణ,పంజాల గోవర్ధన్,ఎమ్మె మహేందర్, అంగిడి స్వామి,చింతల శ్యామ్,జోగు మహేష్, కోల విక్రమ్,నేరేళ్ళ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి ముఠా అరెస్టు

**జయభేరి, పిడుగురాళ్ల :**

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణ శివారులో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుంజి రామాంజనేయులు, దేవళ్ళ లక్ష్మీనారాయణ, బత్తుల హృదయరాజు, భాగం పిచ్చయ్య, కొమెర శివ బాలాజీ, సన్నాయిల కుమారస్వామి అనే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు 9 కిలోలు 898 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారు దాచేపల్లి, అమరావతి, పిడుగురాళ్ల ప్రాంతాలకు చెందినవారని గుర్తించినట్లు గురజాల డీఎస్పీ మహేశ్వరరావు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పారు.



## కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడు పై పెను భారం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆగ్రహం

**జయభేరి, దేవరకద్ర :**

కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడి పై పెను భారం పడిందని పడిందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆగ్రహం వ్యక్తపరిచారు. దేవరకద్రలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ ధర పెంచడంపై ఎమ్మెల్యే జీఎంఆర్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇది సామాన్యుడిపై పెను భారం మోపే నిర్ణయమని ఆయన దుయ్యబట్టారు. 19 కేజీల గ్యాస్ ధరను 993 రూపాయలకు అంటే సుమారు 1000 రూపాయలు వరకు పెంచడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇది సామాన్యుడుపై భారంమోపినట్లు కాదా అని ఆయన అన్నారు. ఈ విషయంలో ఆయన తీవ్ర స్థాయిలో స్పందించారు. ఒక్కసారిగా 30 నుండి 35 శాతం పెంచడంతో హోటల్లు, కేఫ్, రెస్టారెంట్ లతో సహా చిన్న తరహా వీధి వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపిందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. పక్షిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన 24 గంటలు పూర్తికాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఎద్దేవా చేశారు. ముమ్మాటికి ప్రజలను మోసం చేసేందుకే కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని ఆయన ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు పూర్తికాగానే కమర్షియల్ ధర పెంచడం అంటే సామాన్యులను మోసం చేయడమేనని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాపతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## "సే నో టు డ్రగ్స్" ర్యాలీ



**జయభేరి, హనుమకొండ :**

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా "సే నో టు డ్రగ్స్ " అంశంపై శనివారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హనుమకొండ అదాలత్ సర్కిల్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు సాగింది. ఈ ర్యాలీ ను వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్పాయ్ జెండా ఊపి ప్రారంభించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యువత డ్రగ్స్కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలని సూచించారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డిడబ్ల్యుఓ విశ్వజ పోలీస్, ఎక్సైజ్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఈగల్ టీం, ఆశా వర్కర్లు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ




**జయభేరి, మేడ్చల్ :**

విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా దృక్పథం పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ (NSS) కీలక పాత్ర పోషిస్తుందని, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు సమాజానికి దగ్గరవుతూ, అవసరమైన వారికి సహాయం చేసే మనోభావాన్ని అలవర్చుకోవచ్చని సీఎంఆర్ విద్యాసంస్థల చైర్మన్ చామకురా గోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం వేడికాలంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ (NSS) యూనిట్ ఆధ్వర్యంలో సీఎంఆర్ ఆసుపత్రి వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రజలకు చల్లదనాన్ని అందించడంతో పాటు సేవా భావాన్ని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమాన్ని సీఎంఆర్ విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్. గోపాల్ రెడ్డి, డైరెక్టర్ ఏ. రాజి రెడ్డి, సీఎంఆర్ ఆసుపత్రి పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ జె. దుర్గ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డీన్లు, విభాగాధిపతులు పాల్గొని సేవా కార్యక్రమానికి మద్దతు తెలిపారు. వారు స్వయంగా ఆసుపత్రికి వచ్చిన వారికి మజ్జిగ పంపిణీ చేసి సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడం ప్రతి విద్యార్థి బాధ్యత అని, ముఖ్యంగా ఎన్ఎస్ఎస్ వంటి వేదికల ద్వారా విద్యార్థుల్లో సేవా భావన పెంపొందుతుందని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడటమే కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడతాయని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆసుపత్రికి వచ్చిన పలువురు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

## ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలి

- గుండ్లపోచంపల్లి భాజపా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్



**జయభేరి, మేడ్చల్ :**

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10వ తేదీన తెలంగాణ పర్యటనకు రానున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ప్రధాని మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణ పర్యటనకు రావడం ఇదే తొలిసారి కావడంతో ప్రజలు సభకు హాజరు కావాలని ఈటల పిలుపునిచ్చారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షులు కావేరీ శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు పర్యటనలో భాగంగా సుమారు రూ.7,000 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని రైల్వే, జాతీయ రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో పాటు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈటల రాజేందర్ వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ప్రధాని పాల్గొనబోయే సభను జన ఆగ్రహ సభగా పేరు పెట్టడం జరిగిందన్నారు, ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, ప్రజా ఆగ్రహ సభ మేడ్చల్ జిల్లా ఇంచార్జి, అంజన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు కృష్ణ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ల దొడ్ల మల్లికార్జును ముదిరాజ్, సముద్రాల హంసారాణి, డివిజన్ ఇంచార్జీ జగన్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్, గడిల విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, రామారావు, బీజేపీ నాయకులు రవీందర్ గౌడ్, కిషన్, జంగా రెడ్డి, చెంచాల సురేష్,అర్జున్ బాబు, నవనీత, వెంకట్ గౌడ్, రాజు ముదిరాజ్, విక్రమ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## మే 5న ధర్నా చౌక్ వద్ద మహాధర్నా

- "చలో హైదరాబాద్" పిలుపు



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మే 5న హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద భారీ మహాధర్నా నిర్వహించనున్నట్లు బిపిటిఎం నేతలు ప్రకటించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి దారుణంగా మారిందని, ఆత్మహత్యలు పెరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పోలీస్, ఆర్టీఓ చలానాల పేరుతో వేధింపులు పెరిగాయని, ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి యాప్ సంస్థల పై చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. యూనియన్ అధ్యక్షుడు నంద కిషోర్ హెచ్చరిస్తూ.. హామీలు అమలు చేయకపోతే ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని తెలిపారు.

"ఇక మౌనం కాదు... పోరాటమే మార్గం" అంటూ మే 5న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లు వాహన బంద్ చేసి మహాధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి "చలో హైదరాబాద్" పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు.



## లక్ష్మీ నరసింహునికి నిత్య పూజల వైభవం

జయభేరి, యాదగిరిగుట్ట, మే 02 :
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో స్వామివారి ఆలయంలో నిత్య పూజలపైన వైభవం భక్తుల సందడితో నెలకొంది. వేసవి సెలవులు కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుండి స్వామివారి దర్శనార్థం తరలివస్తున్నారు. శనివారం స్వామివారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగగా తెల్లవారుజామున సుప్రభాత సేవ నుండే భక్తులు స్వామివారి దర్శనం తరలివచ్చారు. ఆలయంలో నిర్వహించినటువంటి నిత్య పూజలు సుదర్శన నారసింహ హోమం,అభిషేకం అర్చన, కళ్యాణం,సువర్ణ పుష్పార్చన, వెండి జోడి సేవ,ఆరాధన, పవళింపు సేవ పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని భక్తుల దర్శించుకున్నారు. పిల్లాపాపలతో కుటుంబ సభ్యులతో తరలివచ్చిన భక్తులు స్వామివారి మొక్కుబడులు చెల్లించుకుని చల్లంగా ఉండాలని వేడుకున్నారు. శ్రీ లక్ష్మీ నరసింహునికి దర్శించుకున్న భక్తులు అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారిని కూడా దర్శించుకొని పూజలు నిర్వహించారు.

**ఆలయ నిత్య రాబడి**

యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిత్య రాబడి 40,25,206 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ పరిధిలోని వివిధ విభాగాలు శాశ్వత పూజ, ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు ,ప్రసాద విక్రయం, సత్యనారాయణ వ్రతాలు, కళ్యాణకట్ట,పాతగుట్ట ఆలయం వివిధ విభాగాల నుండి ఆదాయం సమకూరినట్టు తెలిపారు.

**ఈనెల 5న హుండీ లెక్కింపు**

ఆలయ ఉండి లెక్కింపు ఈనెల 5న మంగళవారం రోజున నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం ఏడు గంటలకు కొండ కింద వ్రత మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించబడుతుందని ఈ లెక్కింపుకు ఆలయ ఉద్యోగ సిబ్బంది సరైన సమయానికి హాజరై విధులు నిర్వహించాలని తెలిపారు.




## చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



శంషిగూడ డివిజన్ పరిధిలోని ఆదర్శ నగర్ కాలనీ వెల్ ఫెయిర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిధిగా పాల్గొని రిబన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ వేసవిలో సామాన్య ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఎండలకు ఇబ్బంది పడకుండా తమ యొక్క దాహాన్ని తీర్చుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలందరికి సూచించారు. ఎండలు మండుతున్న తరుణంలో రోడ్డుమీద వెళ్లే పాదచారులకు, వాహనదారులకు ఉపయోగపడేలా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆదర్శ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియచేసారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, వెంకట్ నాయక్, శివానంద్, వెంకటరమణ, రాజేంద్ర, మురళి, సురేష్, రమేష్, మోహన్, జనార్దన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం




జయభేరి, మేడిపల్లి :
మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం కీసరలోని KBR హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్నం మహేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి హాజరై, లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మేడిపల్లి మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు, ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి, కొత్త కిషోర్ గౌడ్ పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడి వారికి చెక్కులను అందజేశారు.ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయం పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల రెవెన్యూ అధికారి (MRO) వెంకట నర్సింహా రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, మండలాల అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ లు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశెంశెట్టి అరెస్టును ఖండించిన రాష్ట్ర కార్యదర్శి పైల

జయభేరి, పరవాడ:
అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేశెంశెట్టి శంకర్రావు దౌర్జన్యంగా పోలీస్ అరెస్టు చేసి పరవాడ పోలీస్ స్టేషన్కి తీసుకు రావడంతో వారిని,గ్రామస్థులని మాడుగుల నియోజకవర్గం పరిశీలికుడు,వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాసరావు కలిసి పోలీస్శాఖ చేసిన అరెస్ట్ను ఖండిచారు. దుప్పుతూరు గ్రామంలో బ్రాండిక్స్ యాజమాన్యం ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా గోడ నిర్మాణం చేపట్టడంతో కంపెనీకి భూములిచ్చిన రైతులు ఆందోళనకి దిగడంతో యాజమాన్యం న్యాయం చేయకుండా పోలీసులను మొహరించి దౌర్జన్యంగా అక్రమ అరెస్టులు చేసి పరవాడ పోలీస్ స్టేషన్ కు అక్రమంగా తీసుకు రావడంతో వారికి సంగిభవంగా పోలీస్



స్టేషన్ లో ఉన్న వారిని వైస్సార్సీపీ నేత పైల శ్రీనివాసరావు పరామర్శించారు. ఈ సందర్భంగా పయిల మాట్లాడుతూ అమరావతిలో అభివృద్ధి అంటు చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం వెంటనే దుప్పితూరు గ్రామస్తుల సమస్యలు పరిష్కారం చెయ్యాలని అచ్చుతాపురం మండలం వైస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావునీ అక్రమంగా అన్యాయం గా అరెస్టు చేయడం చాలా బాధాకరం అని బ్యాండేక్స్ కంపెనీ వారు నిర్మిస్తున్నటువంటి గోడ ను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రయత్నిస్తున్న యాజమాన్యం వైపు కూటమి ప్రభుత్వం మాట్లాడుతుండడం చాలా బాధాకరమైన విషయం అని దుప్పుతూరు ఉన్నటువంటి ప్రజల ఇళ్లను సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఖాళీ చేయించాలని ప్రయత్నం చేస్తున్నటువంటి దాన్ని అడ్డుకుంటున్నటువంటి వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడును & గ్రామస్తులను అరెస్టు చేయడాన్ని వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలికులు పైల శ్రీనివాసరావు ఖండించారు. సంఘీభావం తెలిపిన వారిలో పరవాడ మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, కలపాక ఎంపీటీసీ సప్ప సన్యాసిరావు, బొద్దపు చిన్నారావు, పైల అప్పల నాయుడు తదితరులు వున్నారు.

# వేద పాఠశాలలో చేరండి.. వేదం నేర్చుకోండి

- అన్ని కులాల వారికి వేదం నేర్పిస్తాం
- ఆర్థికంగా సహకరించండి
- మునావత్ లక్ష్మీ రామ్ మహారాజ్

జయభేరి, కొండమల్లేపల్లి :
హిందువుల పిల్లలకు కులాలకు అతీతంగా వేదం( స్మార్తం) నేర్పిస్తామని సద్గురు సంత శ్రీ సేవాలాల్ మహారాజ్ వేద విద్యాలయం నిర్వాహకులు మునావత్ లక్ష్మీరాం మహారాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ పెద్దలు, రాజకీయ ప్రముఖులు అంగరంగ వైభవంగా ఆలయాలను నిర్మిస్తున్నారని,అట్టి ఆలయాలకు నిత్యం పూజలు నిర్వహించేందుకు పురోహితులు లేకపోవడం తమను కలిచివేసిందన్నారు. అందుకే అన్ని కులాల వారికి వేదం( స్మార్తం) విద్యను అందజేసి హిందువుల సంస్కృతి సంప్రదాయాలను భావితరాల వారికి అందించాలని కృషి చేస్తున్నాను అన్నారు. 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరాల లోపు 5వ తరగతి పూర్తి చేసి తెలుగులో చక్కగా రాయగల, మాట్లాడగల నైపుణ్యం ఉన్న హిందూ విద్యార్థులకు ఉచితంగా వేద విద్యను నేర్పిస్తామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ వేదం నేర్చుకోవడానికి మూడు సంవత్సరాల కాలం పడుతుందన్నారు. వేద విద్యలో పట్టా పొందిన పురోహితులచే వేద విద్యను అందించడం జరుగుతుందన్నారు. కొండమల్లేపల్లి పట్టణ మరియు పరిసర ప్రాంత విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వేద విద్యను పూర్తి చేసుకుంటే పెళ్లిలు, నోములు, వ్రతాలు, ఆలయాలలో పూజలు, శుభకార్యాలు నిర్వహించవచ్చునన్నారు. వేద పాఠశాల నిర్వహణ ఖర్చుతో కూడుకున్నదని దాతలు తమ వంతుగా సహకరించి పేద విద్యార్థులకు వేద విద్యను అందించడానికి ఆర్థికంగా చేయూతనివ్వాలని కోరారు. కొండమల్లేపల్లి పట్టణంలోని చింతచెట్టు తండా రోడ్డులో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ఆధ్యాత్మిక ధర్మక్షేత్రంలో వేద పాఠశాల నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



# మన్యం కొండలో ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి గరుడ వాహన సేవ

జయభేరి, దేవరకద్ర :
మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన, రాయచూర్ అంతర్రాష్ట్ర సమీపంలోనున్న శ్రీ లక్ష్మీనరసింహ (ఓబులేషు) స్వామివారి వారి గరుడ వాహన సేవా పూజా కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవాలు గత నెల 30న అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగానే ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని కనుల పండువగ నిర్వహించారు.

ఈ సందర్భంగా స్వామివారిని శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై ఊరేగించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురుల మధ్య స్వామి వారి గరుడ వాహన సేవ ముందుకు కదిలింది. ఈ సందర్భంగా స్వామివారు గరుడ వాహనంపై దేవస్థానం పురవీధుల గుండా ఊరేగారు.

అలంకరణలో ఉన్న స్వామి వారిని చూసి భక్తులు తన్మయం చెందారు.

ఈ సేవకు భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలికారు.ఈ పూజా కార్యక్రమాలలో మన్యంకొండ దేవస్థానం చైర్మన్, వంశ పారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, పాలక మండలి సభ్యులు, దేవస్థానం పూజారులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# భూముల కబ్జా నిగ్గుతేల్చకపోతే.. ఉద్యమం ఉధృతం చేస్తాం

- బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య

జయభేరి, యాదగిరిగుట్ట, మే 02 :
కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్యాయంగా కబ్జా చేసిన సీలింగ్ భూముల నిగ్గు తేల్చకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య హెచ్చరించారు. ఆలేరు నియోజక వర్గంలోని అన్ని మండల కేంద్రాలలో దీక్షలను చేపడతామన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని విలేఖరుల సమావేశంలో కర్రె వెంకటయ్య మాట్లాడారు. యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం,మాసాయిపేట గ్రామాల్లోని సర్వే నంబర్ 322, 728లో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూమి సుమారు 1200 ఎకరాలను స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఓ వెంచర్ తో కుమ్మక్కై అక్రమంగా వెంచర్ నిర్వహించి రూ. కోట్లకు పడగెత్తారని అన్నారు. నిరుపేదలకు అక్రమంగా ప్లాట్లను కట్టబెట్టారన్నారు. ఇప్పుడు వారి ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఎంతో మంది నిరుపేదలు ప్లాట్లను కొనుగోలు చేశారన్నారు. ఒక్కో ప్లాట్లను ముగ్గురు నుంచి నలుగురికి రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. మాసాయిపేట గ్రామంలో సీలింగ్ భూములు కబ్జాలను వెలికితీసి నష్టపోయిన బాధితలకు అందజేయాలని గత రెండు వారాల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని



గ్రీవెన్స్ లో రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ వెంకారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. గత కొన్నేళ్లుగా సీలింగ్ భూమిలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నిరాహార దీక్ష చేపట్టిన అవతవకలను వివరించామన్నారు. ఇందులో ఏ అధికారులు ప్రమేయం ఉందో వివరాలను అందజేశామన్నారు. కానీ ఇప్పటి వరకు అధికారులు విచారణ జరుపలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారులు కొమ్ముకాస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కాకముందే కార్లు, విలాసవంతమైన భవనాలు, ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థను నడిపానంటూ గతంలోనే నేను కోటీశ్వరుడిని అని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పత్రికా సమావేశంలోనే తెలిపిన విషయాన్ని గుర్తు చేశారన్నారు.

ఇన్ని కోట్ల ఆస్తులున్న ఎమ్మెల్యే ఎన్నికల సంస్థను సమర్పించిన అఫిడవిట్లో ఎందుకు తన ఆస్తులను చూపించలేదో చెప్పాలన్నారు. దీనిపై త్వరలో ఎన్నికల కమీషన్,ఏసీబీకి పిర్యాదు చేస్తామని అన్నారు. విలేకరులకు ఒక్కొక్కరికి ఎకరం భూమిని రాసిస్తామని మాటలు చెప్పి తప్పించుకోవద్దని ధమ్ముంటే ఇచ్చిన మాట ప్రకారం ఆలేరు నియోజకవర్గంలో ఉన్న విలేకరులకు ఎకరం భూమి రాసివ్వాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ లో ఇచ్చిన పిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించాలని లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ముట్టడితో పాటు ప్రతి మండల కేంద్రంలో నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ మాజీ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి,యువజన విభాగం మాజీ అధ్యక్షుడు ముక్కర్ల సతీశ్ యాదవ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు కల్వకొలను సతీష్ భట్,రాజేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

జయభేరి, భద్రాద్రి:
రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ముందుగా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత చింతగుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని, మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## దుబ్బాక ప్రజాపాలన కార్యక్రమంలో ఉద్రిక్తత

జయభేరి, దుబ్బాక :
శనివారం నాడు జరిగిన దుబ్బాక ప్రజాపాలన కార్యక్రమంలో ఉద్రిక్తత తలెత్తింది. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నిలదీసారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతుండగా అధికారులు మైకులు కట్ చేసారు. దీంతో ఆగ్రహంతో ఎమ్మెల్యే మైకులను నేలకేసి కొట్టివేసారు. వడ్ల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని నేలపై కూర్చొని నిరసనకు దిగారు.



# ఆ సీన్స్ ట్రిమ్ చేయండి ప్లీజ్?


చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఉపయోగం ఏముంటుంది?.. పాపం.. ఈ విషయం బాలీవుడ్ నటి కియారా అద్వానీకి అర్థం కావడంలేదు. జరగాల్సిన నష్టం జరిగిపోయాక.. సరిదిద్దుకునేందుకు ప్రయత్నించడం నిష్ప్రయోజనం. ఇంతకీ చేతులు కాలేంత పని కియారా ఏం చేసింది? అనే వివరాల్లోకెళ్తే.. 'కేజీఎఫ్' ఫేం యష్ నటిస్తున్న పాన్ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్'లో కియారా అద్వానీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తన కెరీర్‌లో ఇప్పటివరకు గ్లామరస్, రొమాంటిక్, కమర్షియల్ రోల్స్ ఎన్నో చేసింది కియారా. అయితే.. 'టాక్సిక్'లో మాత్రం మరింత బోల్డ్‌గా, ఇంటెన్స్ పాత్రను ఆమె పోషించింది. ఇందులో శృతి మించిన బోల్డ్ సీన్స్‌లో కూడా కియారా నటించినట్టు వినికిడి. ఆ సీన్స్ పూర్తిగా ఆమె అనుమతితోనే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించినా, ఫైనల్ అవుట్‌పుట్ చూసుకున్నాక, కియారా షాక్‌కి గురైందట. దాంతో ఆ బోల్డ్ సీన్స్‌ను ట్రిమ్ చేయాలంటూ దర్శకురాలిని కోరిందట. అయితే.. దర్శక,నిర్మాతలు అందుకు నిరాకరించినట్టు తెలిసింది. మరోవైపు.. ఇది కేవలం గాసిప్ మాత్రమేనని, సినిమాకు హైప్ తెచ్చేందుకే ఇలాంటి గాలివార్తలు సృష్టిస్తున్నారంటూ కూడా కథనాలు వెలువడుతున్నాయి. అసలు నిజమేంటో సినిమా విడుదలైతే కాని తెలీదు. త్వరలోనే సినిమా విడుదల కానున్నది.



## గరికపాటికి వార్నింగ్ ఇచ్చిన "కింగ్ బుద్ధ" మూవీ డైరెక్టర్ సత్యారెడ్డి

ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా బుద్ధ జయంతిని సంపూర్ణ నేషనల్ హాలిడేగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాలో "కింగ్ బుద్ధ" హాలీవుడ్ మూవీ డైరెక్టర్ సత్యారెడ్డి తీవ్రంగా స్పందించారు. గతంలో గౌతమ బుద్ధుడిని పిరికివాడిగా వ్యాఖ్యానించిన ప్రవచనకర్త గరికపాటికి ఆయన కఠినమైన హెచ్చరిక జారీ చేశారు. "ఇకనుంచి ఎవరైనా గౌతమ బుద్ధుని గురించి తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు. బుద్ధుని అవమానించే ప్రయత్నాలు ఏవైనా జరిగితే వాటిని తీవ్రంగా ఖండిస్తాం" అని సత్యారెడ్డి గారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గౌతమ బుద్ధుడు సాధారణ వ్యక్తి కాదు. ఆయన 'శాక్య సింహం'. ఆయన జీవితం పిట్ట కథలు, చేపల కథలు కాదు, అది ఒక మహా వీరగాథ, శాంతి సందేశం. భావితరాలకు బుద్ధుని నిజమైన చరిత్ర, తత్వం. ఆయన చూపిన మార్గం తెలియజేయడం మన బాధ్యత," అని అన్నారు. అంతేకాక బుద్ధుని జీవితంలో ఒక విశేష ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. "బుద్ధుడిగా మారిన తర్వాత కపిలవస్తు రాజ్యంలో అడుగు పెట్టిన రోజు, ఆయన భార్య యశోధర పట్టణాన్ని దీపాలతో అలంకరించి అపూర్వ స్వాగతం పలికింది. ఆ మహత్తర సందర్భమే తర్వాత 'బుద్ధ దీపావళి'గా మారింది" అని సత్యారెడ్డి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా బుద్ధుని మార్గాన్ని అనుసరిస్తున్న దాదాపు 25 దేశాలు శాంతి, అభివృద్ధి, సమానత్వంలో ముందంజలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. "ఆ దేశాలు పురోగతిని చూసి భారతదేశం కూడా మరోసారి బుద్ధిజం వైపు పయనించాలి. అదే నిజమైన శాంతి, అభివృద్ధి దారి" అని సత్యారెడ్డి గారు అభిప్రాయపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మద్దతుదారులు కూడా బుద్ధ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని గట్టిగా డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఈ డిమాండ్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సత్యారెడ్డి తెలిపారు. "బుద్ధ జయంతి - జాతీయ గౌరవ దినం కావాలి" అనే నినాదంతో ఈ ఉద్యమాన్ని దేశమంతా విస్తరించనున్నట్టు ఆయన వెల్లడించారు.

## జర్మనీ బ్లాక్ ఫారెస్ట్‌లో శిక్షణ



విరామం దొరికితే చాలు.. ఫ్యామిలీతో ఫారిన్ చెక్కేయడం, కుటుంబసమేతంగా విహారయాత్రలు చేయడం సూపర్‌స్టార్ మహేశ్‌బాబుకు పరిపాటే. అందుకే ఆయన్ను ఇండస్ట్రీలో అంతా కంప్లీట్ ఫ్యామిలీమ్యాన్‌గా అభివర్ణిస్తుంటారు. తాజాగా ఆయన జర్మనీ వెళ్లారు. అది కూడా విహారయాత్ర నిమిత్తమే అని అంతా అనుకున్నారు. కానీ వాస్తవం వేంటంటే.. 'వారణాసి' సినిమా కోసం ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకునేందుకు ఆయన జర్మనీ వెళ్లారు. ప్రస్తుతం అక్కడ బ్లాక్ ఫారెస్ట్‌లో ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు మహేశ్. దీనికి సంబంధించిన ఫొటోలను కూడా స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారాయన. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. 'వారణాసి' విషయానికొస్తే..ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులందర్నీ ఆకర్షించడమే లక్ష్యంగా దర్శకుడు రాజమౌళి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భారతీయ పురాణేతిహాసాలను స్పృశిస్తూ, పలు దేశాలతో ముడిపడిన కథ కావడంతో 'వారణాసి'పై మరింత శ్రద్ధ పెట్టారాయన. ఇందులో మహేశ్ ప్రపంచ యాత్రికుడిగా కనిపిస్తారు.

# గౌతమ బుద్ధ జయంతిని సంపూర్ణ నేషనల్ హాలిడేగా ప్రకటించాలి



**లేదంటే దేశవ్యాప్త ఉద్యమం : సత్యారెడ్డి హెచ్చరిక**

ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిర్వహించిన భారీ ధర్నా కార్యక్రమంలో కింగ్ బుద్ధ హాలీవుడ్ మూవీ డైరెక్టర్ సత్యారెడ్డి గౌతమ బుద్ధుని జయంతిని ఆగస్టు 15 (స్వాతంత్ర్య దినోత్సవం), జనవరి 26 (గణతంత్ర దినోత్సవం) లాగే దేశవ్యాప్తంగా సంపూర్ణ నేషనల్ హాలిడేగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను అమలు చేయకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. బుద్ధ జయంతి సందర్భంగా సత్యారెడ్డి ఆధ్వర్యంలో "చలో ఢిల్లీ" కార్యక్రమం నిర్వహించి జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయితలు బొర్రా గోవర్ధన్, సీతారామయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఢిల్లీతో పాటు అనేక రాష్ట్రాల నుండి బౌద్ధ సంఘాల నాయకులు, బంతిజీలు, మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సత్యారెడ్డి మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాయుద్ధనౌకర, విప్లవకవి గద్దర్ అన్నతో కలిసి "ఉక్కు సత్యాగ్రహం" సినిమా నిర్మించి ప్రైవేటీకరణను అడ్డుకున్న అనుభవం తనకు ఉందని తెలిపారు. గద్దర్ ద్వారా బుద్ధిజానికి ఆకర్షితుడై, ప్రస్తుతం ప్రపంచస్థాయిలో "కింగ్ బుద్ధ" అనే భారీ హాలీవుడ్ చిత్రాన్ని 100 భాషల్లో నిర్మిస్తున్నానని చెప్పారు. ఈ సినిమా ద్వారా గౌతమ బుద్ధుని శాంతి సందేశాన్ని ప్రపంచానికి అందించడమే తన లక్ష్యమని, ఇరాన్-ఇజ్రాయిల్, రష్యా-ఉక్రెయిన్ వంటి యుద్ధాలు ఆగి, మూడో ప్రపంచ యుద్ధం రాకుండా ఉండాలంటే బుద్ధుని మార్గాన్ని ప్రపంచం అనుసరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 50 కోట్ల మంది బుద్ధుని మార్గంలో నడుస్తున్నప్పటికీ, బుద్ధుని జన్మస్థలం అయిన భారతదేశంలో బుద్ధ జయంతి సంపూర్ణ నేషనల్ హాలిడేగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గజిటెడ్ హాలిడేగా ఉన్నప్పటికీ, ఆగస్టు 15, జనవరి 26 లాగే అన్ని రాష్ట్రాలు, ప్రైవేటు సంస్థల్లో పూర్తిగా అమలు కావడం లేదని విమర్శించారు. ఈ హక్కు సాధన కోసం దేశవ్యాప్తంగా బౌద్ధ సంఘాలను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ముఖ్య అతిథుల అభిప్రాయాలు: బొర్రా గోవర్ధన్ మాట్లాడుతూ..బహుజన రాజ్యాధికారం గౌతమ బుద్ధుని ఆశయమని, అది సాధించినప్పుడే ఇలాంటి నేషనల్ హాలిడేలు సాధ్యమవుతాయని అన్నారు. ఈ పోరాటంలో సత్యారెడ్డికి చివరివరకు మద్దతుగా ఉంటామని ప్రకటించారు. సీతారామయ్య మాట్లాడుతూ.... గద్దర్ అన్నతో కలిసి ఉద్యమాలు చేసిన సత్యారెడ్డి గారు ఈ డిమాండ్ సాధించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు తాను సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనేక రాష్ట్రాల నుండి వచ్చిన బౌద్ధ సంఘాల నాయకులు, కవులు, కళాకారులు, సినీ ప్రముఖులు, మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## మిస్ యూనివర్స్ ఇండియా టు టాలీవుడ్..

రియా సింఘా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పుట్టి పెరిగింది. హీరోయిన్ కావాలనే కోరిక చిన్నప్పటి నుంచి ఉండడంతో చదువుకునేటప్పుడే మోడల్ గా చేసేందట. కేవలం 16 ఏళ్ల వయసు నుంచే పలు ఫ్యాషన్ షోలలో పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇదే క్రమంలో కేవలం 19 ఏళ్ల వయసులోనే మిస్ యూనివర్స్ ఇండియా టైటిల్2024ను గెలుచుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది అందాల తార. ఈ కాంపిటీషన్ లో సుమారు 51మంది ఫైనలిస్టులతో పోటీ పడుతూ ఆమె ఈ కిరీటాన్ని సొంతం చేసుకోవడం మరో విశేషం. అందాల పోటీల్లో రాణిస్తూ చదువును ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేదు రియా సింఘా. పర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో డిగ్రీ పూర్తి చేసింది ముద్దుగుమ్మ. ఒక రియా కేవలం మోడల్, నటి మాత్రమే కాదు.. ఆమె ఒక అద్భుతమైన డాన్సర్ కూడా. అలాగే ఆర్ట్ కూడా బాగా వేస్తుందట సుస్మితా సేన్, లారా దత్తా వంటి వారిని స్ఫూర్తిగా తీసుకున్న రియా సింఘా మొత్తానికి హీరోయిన్ కావాలన్న కోరికను సాకారం చేసుకుంది. జెట్లీ సినిమాలో ఏజెంట్ శివాని పాత్రలో ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి. సినిమా కూడా డీసెంట్ టాక్ తెచ్చుకుంది. కాగా ప్రొఫెషనల్ లైఫ్ సక్సెస్ కావడంతో తన తండ్రి బ్రిజేష్ సింఘా, తల్లి రీటా సింఘా పాత్ర ఎంతో ఉందంటోంది రియా సింఘా. తన కలలను సాకారం చేసుకోవడంలో వారు ఎంతో ప్రోత్సాహం చారంటోంది ముద్దుగుమ్మ.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**